# ప్రథమ పరిచయానందం

మొదటిసారిగా ఏ పనైనా చేసేటప్పుడు జాగర్త పడటం లోకంలో సహజం జాగర్త పడ్డా సరే, అడుసు తొక్కేసి అభాసుపాలవటం, 'ఛీ ఇంకెప్పుడూ ఈ పని చెయ్యకూడదని' విసుక్కోవటం కూడా అంతకన్నా సహజం. ఈ పరిస్తితి ఎందుకొస్తుందంటే ఆ పడాలనుకున్న జాగర్త ఏదో ఎంత మేరకు ఏ సమయంలో పడాలో ముందుగా మన అంచనాకు అంది చావదు కాబట్టి!

ఒకానొక ప్రథమ పరిచయ కార్యక్రమంలోంచి నేను - తత్ పరిచయానంద హేలా వినోద విభ్రమావిర్భూత సంభ్రమభ్రమచ్చిరోంతర్గత నేత్రో న్మీలనావస్థా స్తంగత చేతనా ప్రాణార్థ మాత్రుండనే....

( ఏంలేదు, ఆ పరిచయం దెబ్బకి బుర్ర తిరిగి, సగం చచ్చి) ఎట్లా బడటపడ్డానో- అన్న వైనం చిత్తగించండి!

★ ★ ★

బదిలీమీద కొత్తగా మా కాలేజీలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంటులో కొచ్చి చేరాడు లెక్చరరు వజ్రఘంటం. అతనొక రచయిత. అతన్నెప్పుడూ నేను చూళ్లేదుకాని, అతను పైకి రాగలవాడు అని మాత్రం అనుకున్నాను అతని రచనలు చదివి గతంలో అతనొచ్చినట్టు నాకు తెలిసి పది రోజులైనప్పటికీ, మేమిద్దరం కలుసుకోవటం మాత్రం పడలేదు. నేను కూడా రచయితనవటం చేత నన్ను కలుసుకోవటం కోసం అతను తహతహలాడుతూన్నాడని తెలిసింది. అంతేకాదు, ఒకాదివారంనాడెప్పుడైనా సరే తిన్నగా తనింటికొచ్చేయమని, తను చాలా సంతోషిస్తాననీ అతను నాకు చెప్పమన్నట్టు మా ఉభయులకీ వారధులయిన బి.యస్సీ. కుర్రాళ్లు నాకు చెప్పారు. అతని అడ్రసు కూడా వాళ్ళే ఇచ్చారు.ఒక రచయిత తనింటికి ఇంకో రచయితను మనఃస్ఫూర్తిగా ఆహ్వానించటమనేది మామూలు విషయం కాదుగదా! అంచేత ' ఆకాశమే అవధా?' అన్నంత ఉత్సాహంతో ఆ ఆదివారం సాయంత్రం నా శ్రీమతితో కలిసి వజ్రఘంటం ఇంటికెళ్ళాను. సింహద్వారం తీసుంది. ఒ తెల్లటి బొచ్చు కుక్క లోపల్నుంచొచ్చి మా మీదికి ఎగబడింది. వజ్రఘంటానికున్న కుక్కల టేస్టును మెచ్చుకుంటూ లోపలికి నడిచి బెల్లు నొక్కాను. " వస్తున్నా కూర్చోండి" అని వినిపించింది. మేమిద్దరం సోఫాలో కూర్చున్నాం స్వీట్లవాసన పసిగట్టినట్టుంది. ఆ కుక్క నా శ్రీమతి చేతిలోని పాకెట్ మీదకి ఎగిసెగిసి పడుతోంది. దాని బాధపడలేక ఆమె దాన్ని కసిరింది. నేను, " తప్పు వజ్రఘంటంగారికి కోపం రావచ్చు. ఓర్చుకో" అన్నాను. చివరికి ఆమె ఆ పాకెట్ విప్పిఒక స్వీటు అకుక్కకు అందించబోయింది అంతే! అది చటుక్కున ఆ పాకెట్ మొత్తాన్ని నోట దొరకబుచ్చుకొని వీధిలోకి ఒక్క దూకు దూకేసింది మేమిద్దరం తెల్లబోయాం.

ఇంతలో వజ్రఘంటం వచ్చాడు. మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు. అతన్ననుసరిస్తూ నేనన్నాను, " మీకుక్క భలే తెలివైనదండోయ్!" చట్టుక్కున వజ్రఘంటం అన్నాడు, " తెల్లకుక్కేనా, ఏమయిందేంటి?' '.. " అఁ ఏంలేదు, ఒక స్వీట్ పెట్టబోతే మొత్తం పాకెట్టు కావాలంది "

" ఎత్తుకుపోయిందా! అరె! అది దొంగ కుక్కండీ! ఎదురింటివాళ్ళది నాది కాదు. నాకు కుక్కలంటే అసహ్యం!"

నేను తెల్లబోయాను నాభార్యా అలాగే అయింది పదిహేను రూపాయలు నష్టపోయి నందు క్కాదు, పట్టి చేతుల్తో వచ్చినట్టయినందుకు!

నేనూ నాభార్యా పక్కపక్కనే కూర్చున్నాం. వజ్రఘంటం నారచనల వివరాలడిగాడు. 'చెప్పకోకూడదు, చెప్పకోకూడదు' అనుకుంటూనే సొంతడబ్బా మొదలెట్టాను. అయిదారు నిముషాలయింది. నా భార్యకు బోర్ కొడుతుందని నాకు తెల్సు. కానీ ఏం చెయ్యను. ఎంతకీ వజ్రఘంటం భార్య బయటికి రాందే.

వజ్రఘంటం ఒక పబ్లిషర్ అడ్రస్సు చెప్పాడు నేను నాపక్కనే టీవీ మీదున్న పుస్తకాల బొత్తిలోంచి పైపుస్తకం అందుకొని ఒత్తుగా పెట్టుకొని నా డైరీలో ఆ అడ్రస్సు రాసుకున్నాను. ఆ పుస్తకం ఇంకా నా ఒళ్లోనే ఉంది. ఇంతలో అతని కూతురు వాకిట్లోంచి హడావిడిగా వచ్చి ఆ పుస్తకాల బొత్తి పుచ్చుకొని "ఫ్రెండింటి కెడుతున్నా నాన్నా" అంటూ వెళ్ళిపోయింది.

అయిదు నిముషాల్లో ఆ అమ్మాయి తిరిగొచ్చి "ఈ పుస్తకాల మీద ఇంకో పుస్తకం ఉండాలి ఏమయింది?" అంటూ నా ఒళ్ళో పుస్తకం చూపి "మీరు తీసారా అంకుల్?" అంది. నేను పుస్తకం అందిస్తూ "ఏమ్మా చదువాగిపోయిందా?" అన్నాను.

ఆ అమ్మాయి, "ఆదివారం పూట చదువేంటి అంకుల్! నా ఫ్రెండు తాలూకు పోస్టు చెయ్యాల్సిన అప్లికేషను కవరు, ఇందులో ఉండిపోయింది. తీరా పోస్టాఫీసు కెళ్లాక చూసుకుంటే ఈ పుస్తకం లేదు. ఇప్పుడు సండే క్లియరెన్సు టైమయిపోయింది డేటూ దాటిపోయింది. మా ఫ్రెండుక్కోపం వస్తుంది. ఎలా! బాడ్‌లక్! ప్చ్!" అంటూ వెళ్ళిపోయింది.

మామధ్య మరి కాసేపు మాటలయ్యాక వజ్రఘంటం, వంటింటివైపు చూస్తూ, "మూడు కాఫీలోయ్" అన్నాడు.

గది గుమ్మం పక్కగా సందులో కూర్చుని అంట్లు తోముతున్న పనిమనిషి మూడు కప్పులు కడిగి గుమ్మంలో పెట్టింది. వంటింట్లోంచి చలాకీగా ఉన్న పాతికేళ్ళ పడుచొచ్చి ఆ కప్పులు తీసికెళ్లింది. కాఫీ పట్టుకొచ్చింది. ఇప్పటికి సాటి ఆడది కంటికి ఆనటంతో నా భార్య ఉత్సాహంగా అంది : "ఇల్లు చూసి ఇల్లాలిని చూడమన్నారు మీ గృహాలంకరణ బాగుంది. ఈ కాఫీ కూడా అంతే బాగుంది!"

చటుక్కున వజ్రఘంటం అన్నాడు "ఈమె నాభార్యకాదు, నా మరదలు." ఆ పడుచు సిగ్గుతో లేచెళ్లిపోయింది. ఈ మాటు నా భార్య తో బాటు నేనూ నాలిక్కరుచుకున్నాను. మరింక అక్కడున్నంతసేపూ నోరెత్తలేదు నాభార్య.

మా సంభాషణ కాలేజీల్లోని ఊకదంపుడు సిలబస్సు, పోరంబోకు స్టూడెంట్సు, అసమర్థపు ప్రిన్సిపాళ్లు, వగైరాల మీదికి మళ్ళింది.

ఇంతలో నా దృష్టి, వంట సామాన్లని నీట్‌గా కడిగి పెడుతున్న పనిమనిషిమీద పడింది. "ఎంతిస్తున్నారు పనిమనిషికి? పాపం ఆయాసపడుతున్నట్టుందే!" అన్నాను.

వజ్రఘంటం ఇబ్బందిగా చూసాడు అన్నాడు . "ఆమె. ఆమె.. పనిమనిషి కాదు. నాభార్య. పనిమనిషి రావటంలేదు."

సందులో ఉన్న 'పనిమనిషి' దభాల్న తలుపేసుకుంది.

తిన్నాను, దిమ్మ తిరిగేట్టు మూడో దెబ్బ తిన్నాను ! కనకనే వెంటనే "సారీ సర్, ఎక్స్ట్రీమ్లీ సారీ" అన్నాను. వజ్రఘంటం నవ్వాడు.

ఇంతలో వంటింట్లోంచి ఏడెనిమిదేళ్ళ కుర్రాడొకడొచ్చాడు. వచ్చి, మా ముగ్గురికీ వక్కపొడి డబ్బా అందించాడు. ఆ కుర్రాడు పుష్టిగా ఎర్రగా మంచి డ్రస్సులో నీట్ గా ఉన్నాడు. వాణ్ణి ఎందుకో

పరిశీలనగా చూసాను. ఊరుకోకుండా నాకున్న హోమియోపతి విజ్ఞానాన్ని వెలగబెట్టాను. అన్నాను " కుర్రాడికి కుడికన్ను ఎర్రగా ఉంది బహుశా శ్వాసకోసం వాపుగాని, కీళ్లవాతం గాని ఉందేమో డాక్టరుకు చూపించకపోయారా?"

వజ్రఘంటం అన్నాడు : " అది గాజుకన్ను ఎడమ కన్ను చూసి చెప్పగలరేమో చూడండి."... అదిరిపోయాను. కానీ వెంటనే తేరుకొని, " అయితే మీ అబ్బాయి ఆరోగ్యానికేమి ఢోకాలేదు. మేధావి అవుతాడు, సందేహం లేదు. నుదురు పెద్దది కదా!" అన్నాను.

వజ్రఘంటం మళ్ళీ ఇబ్బందిగా మొహం పెట్టాడు." వీడినుదురు పెద్దదేగాని వీడు నా కొడుకు కాదు. మా పనిమనిషి కొడుకు. తల్లి పన్లోకి రావట్లేదని చెప్పటానికొచ్చాడు. ఎవరైతేనేం లెండి, మేదావి అవుతాడు గదా!"... నాభార్య సన్నగా నా కాలు నొక్కింది, ' ఇంక ఈ ఇంట్లోంచి మనకి పోయేకాలం వచ్చేసింది పదండి' అంటున్నట్లు. మగాడికి బుర్ర అమోఘంగా అందుకుంటుందనేది అందరికీ తెలిసిన సత్యం. అది జ్ఞాపకం వచ్చి సైనికుల్లాగా రంగున నుంచున్నాను.

నాఏడుపు మొహానికి నవ్వు కాస్త పులుముకొని, " ఇంతకీ మీ రచనా వ్యాసంగం గురించి చెప్పనేలేదు- పోన్లెండి. ఇప్పటికి మరి వస్తాం వజ్రఘంటంగారూ. మళ్లీ కలుద్దాం. మా ఇంటికి మీరు కూడా రండి " అన్నాను.

అతను, " వజ్రఘంటమా, ఆయన్ది పక్కిల్లు, నాపేరు తీక్ష్ణ దంష్ట్రం. నేను కూడా ఫిజిక్సు, డిపార్ట్‌మెంట్ లోకి కొత్తగా వచ్చిన వాణ్ణే మీ గురించి వజ్రఘంటం గారు చెబుతూంటే విన్నాను. మిమ్మల్ని దూరం నించి చూశాను. ఎప్పుడు కలుద్దామా అని ఉవ్విళ్లూరుతున్నాను. ఇలా మీరే వచ్చారు. నాకు మహానందంగా ఉంది."

' నాకు భారీ దుఃఖంగా ఉంది.' మరి అందామనుకున్నాను. తమాయించుకున్నాను. క్షణంలో నా లెక్కల తెలివి ఉపయోగించి ప్లేటు ఫిరాయించేసాను... అన్నాను: " ఆఁ అదే, అదే సార్, పొద్దున్న మార్కెట్లో వజ్రఘంటంగారు నాకు కలిసి, ఈ సాయంత్రం తప్పక రండని ఆహ్వానిస్తే మిమ్మల్ని ఆయన్నీ ఇద్దర్నీ ఒకేసారి కలిసి నట్టుంటుందని వచ్చాను. ముందర మిమ్మల్ని కలిసానంతే. వస్తానూ."

ఈసారి నకిలీ వజ్రఘంటం, అదే , తీక్ష్ణదంష్ట్రం, నిజంగా తెల్లబోయాడు. అన్నాడు : " పొద్దున్న కలిసారా, ఇంపాసిబుల్, నిన్న రాత్రేగదండీ ఆయన ఫామిలీతో సహా ఇల్లు ఖాళీచేసి వెళ్ళింది! నేనే గదా సామాను లారీ కెక్కించింది! ఇక్కడ జాయినయిన వెంటనే ఆయన రాజమండ్రికి ట్రయల్ మొదలెట్టాట్ట. నిన్ననే రిలీజ్ ఆర్డర్సొచ్చాయ్. ఈ రోజెట్లా కలిసాడు మిమ్మల్ని?"

నాకాళ్ళకింద భూమి నెర్రులు విచ్చుతోంది- కుక్క ఆయన్దికాదు. ఆ యువతి ఆయన భార్య కాదు ఆయన భార్య పనిమనిషి వాదు. ఆ పుస్తకం ఆ అమ్మాయిది కాదు. అసలాయన 'ఆయనే' కాదు!"

' తత్ ప్రథమ పరిచయానంద ప్రమాదోద్భూత విభ్రమభ్రమితాంతరంగుడనై ....' అంటే ఏం లేదు, బుర్ర గిర్రున తిరిగి, సగం చచ్చి ఎట్లాగో బతికి స్పృహలోకొచ్చేసరికి మేమిద్దరం ఆటోలో ఆ ఇంటికి అరమైలు దూరంలో ఉన్నాం.

(క్రోక్విల్ హాస్యప్రియ మే 90)

★★★ ★★★ ★★★